**జరిగిన కథ :** కాశీమజిలీల్లో ప్రస్తుతం సప్తమిత్ర చరిత్రలో ఉన్నాం. కాళిదాస మహాకవి రచించిన మేఘసందేశంలోని యక్షుడు కూడా ఒక ప్రధాన పాత్రగా.. ఏడుగురు మిత్రుల మధ్య ఈ కథ నడుస్తుంది. కాళిదాసు, భోజరాజు కూడా ఇందులో ఉంటారు. భైరవుడనే తాంత్రికుడు నెమలిగా మార్చిన భోజరాజుగారి భార్యను యక్షుడు మళ్లీ మనిషిగా మార్చాడు.




అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ



# లీలావతి - రుక్మిణి

**మరునాటి** నుంచి యక్షునికి ఒకటే పని. ప్రతిరోజూ ఉదయాన్నే బయల్దేరి వెళ్లి, భైరవుడు చేసే కపటపు పనులన్నీ గమనించేవాడు. అరణ్యాలలో రహస్యంగా వాణ్ని వెంబడించేవాడు. భైరవుడి దగ్గరున్న జీవులను పరిశీలించి, కావలి వాళ్లు చూడకుండా ఏదో ఒక పక్షినో, జంతువునో చేత చిక్కించుకుని తిరిగి తన గుహకు చేరుకునేవాడు. అలా సువర్ణపదిక వల్ల కొన్ని జంతువులు మానవరూపాన్ని పొందుతుండేవి. తమ తావులకు వెళ్లిపోయేవారు.

ఇలా ఉండగా.. భోజరాజు ధారానగరం చేరుకునేలోపుగా దారిమధ్యలోనే.. భైరవుడికి ఒక ఆజ్ఞాపత్రం వెలువరించమని తన పుత్రుడైన చిత్రసేనుడికి వర్తమానం చేశాడు. 'కాళిదాసు గౌరవార్థం.. భైరవుడు కూడా తన జంతువులతో వచ్చి ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది' అని.

భైరవుడు రాజాజ్ఞను పాటించక చేయగలిగింది ఏమీ లేకపోవడంతో.. ఒక బరువులు మోసే గాడిద మెడలో వేరొక తాయెత్తు కట్టి, దానిని మేకను చేశాడు. భోజరాజు గారి ఆస్థాన వంటవాడికి ఆ మేకరూపంలోని గాడిదను అప్పగించాడు. వాడు దానిని కోయడానికి దూరంగా తీసుకువెళ్లాడు.

ఈ మార్పులన్నీ ప్రచ్ఛన్నంగా చూస్తూ వస్తున్న యక్షుడు.. అప్పటికప్పుడు ఒక మేకను తన చేతిలోకి రప్పించుకున్నాడు. వంటవాడి దగ్గరికి వెళ్లి..

''ఓరోరీ! నువ్వు ఆ మేకను కొయ్యబోకు. నాకు అమ్మెయ్యి. బదులుగా నీకు నేనీ మేకను, ఇవిగో ఈ నాణేలను ఇస్తాను'' అన్నాడు.

ఆ వంటవాడు స్వల్పధనానికి ఆశపడలేదు. యక్షుడు తన చేతి రత్నకంకణం కూడా సమర్పించుకోవాల్సి వచ్చింది. దాంతో వంటవాడు మేకను మార్చడానికి ఒప్పుకొన్నాడు. యక్షుడు ఆ మేకను పుచ్చుకుని తన గుహకు చేరుకున్నాడు. రత్నపదిక ఆ మేక మెడలో రెండు తాయెత్తులు ఉండటం గమనించింది. ఒక తాయెత్తును ఊడదీస్తే గాడిదగానూ.. వేరొక తాయెత్తును తీయగానే చారాయణుడి అసలు రూపమూ వచ్చాయి.

అలా చారాయణుడికి బాహ్యస్మృతి కలుగగానే..

''ఓరీ పాపాత్ముడా! ఎంతటి గురుద్రోహానికి ఒడికట్టావురా?! దయాసింధువైన ఆ మహాత్ముడు నీకేం అన్యాయం చేశాడు?! కనబడవేం.. ఎక్కడికి పోయావు?!'' అంటూ చుట్టూ చూశాడు.

అది తానుండాల్సిన అడవి కాదు. ఎన్నెన్నో విలువైన వస్తువులతో.. మానవులకు అలభ్యమైన దివ్యవస్తువులతో అలంకరించి ఉన్న యక్షుని గుహలోని ఒకానొక గది. ఎదురుగా సువర్ణనాభుడు ఉన్నాడు.

''మిత్రమా! అంటూ కౌగిలించుకున్నాడు''.

ఆ తరువాత మిత్రులిద్దరూ అప్పటివరకూ తమ జీవితాల్లో జరిగినదంతా నెమరేసుకున్నారు. తన భార్య మల్లిక కూడా అక్కడే ఉండటం అతనికి మరింత సంతోషాన్ని ఇచ్చింది.

సువర్ణనాభుడు తన మిత్రునికి యక్షుడిని పరిచయం చేశాడు.

''ఈయన వల్లనే నువ్వూ, నీ భార్య, భోజరాజు భార్య కూడా ఉద్ధరించబడ్డారు. కానీ, మన ఘోటకముఖుడు ఇంకా భైరవుడి వద్దనే ఉన్నట్లు మాకు అనుమానంగా ఉంది. దానికోసమే ఈయన రోజూ ఆ భైరవుడి చర్యలను ప్రచ్ఛన్నంగా గమనిస్తూనే ఉన్నాడు. అసలు సంగతి తొందరలోనే తేలిపోతుంది'' అన్నాడు.

కానీ, చారాయణుడు అంగీకరించలేదు.

''అయ్యా! ఎందుకిదంతా?! మనం వెళ్లి జరిగిందంతా భోజరాజుగారికి చెప్పుకొందాం. ఆయనే మనకు తగిన న్యాయం చేస్తాడు'' అన్నాడు.

ఆ మాట వినేసరికి యక్షునికి హడలెత్తింది.

''బాబూ! వాడు మంత్రతంత్రాలను ఎరిగినవాడు. వాడి చేత చిక్కితే నా పని కూడా పట్టగలడు. వాణ్ని పరిభంగం చేసే మార్గం ఇది కాదు. తొందరలోనే కాళిదాసు గారి గౌరవార్థం పెద్దసభ జరుగబోతున్నదట. దానికి వీడు కూడా వస్తున్నాడు. ఆ సమయంలో మనం మన పనిని తెలివిగా నెరవేర్చుకోవాలి'' అని చెప్పాడు.

ఆ మరునాడు ధారానగరంలో సభ ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయో చూడటానికి యక్షుడు వెళ్లాడు. అతని దురదృష్టమేమో కానీ, తాను మేకగా మార్చిన చారాయణుణ్ని అతను దొంగతనంగా ఎత్తుకుపోయాడని భైరవుడికి అప్పటికే తెలిసిపోయింది.

ఆ విషయం యక్షుడికి తెలియదు. అలవాటు చొప్పున ప్రచ్ఛన్నంగా భైరవుని వెంట తిరగసాగాడు. ఆ విషయం భైరవుడు గుర్తుపట్టేశాడు.